క్లుప్తంగా

ఎమ్మెల్యే నాని సహకారంతో ఏఎంసీ అభివృద్ధి



ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎంసీ వైస్‌చైర్మన్ రామకృష్ణ

ఏలూరు రూరల్: ఎమ్మెల్యే ఆళ్లనాని నేతృత్వంలో ఏలూరు మర్కెట్ యార్డ్ అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతోందని ఏఎంసీ వైస్‌చైర్మన్ కంచన రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఆళ్ల నానిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నానికి కృతజ్ఞతలు తెలిపారు. నాని సూచనల మేరకు ప్రభుత్వం ఏలూరు ఏఎంసీ పాలకవర్గం కాలపరిమితి మరో ఏడాది పొడిగించడం సంతోషకరమని రామకృష్ణ అన్నారు. దీంతో పాలకవర్గం యార్డ్ అభివృద్ధి మరింత కృషి చేస్తుందని చెప్పారు. నాని సహకారంతో యార్డ్‌లో రూ.3.50 కోట్లతో చేపట్టిన జంబోషెడ్డు పనులు త్వరలో పూర్తి చేస్తామని వివరించారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

దెందులూరు: స్థానిక సీహెచ్‌సీలో ఏసీ మరమ్మతులు, వాటర్ ప్యూరిఫైర్ మార్పు, ఇన్వెర్టర్ బ్యాటరీలు, ఓపీ టికెట్లు కొనుగోలు చేసినట్టు అభివృద్ధి కమిటీ సమావేశంలో సభ్యులు వెల్లడించారు. రూ. 2.76 కోట్లతో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనం వద్ద రూ. 1.50 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి సలహా సభ్యులు తొత్తడి వేదకుమారి, కట్టా ఏసుబాబు, వైద్యులు ఉన్నారు.

15న బీకేఎంయూ జిల్లా సమితి సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా సమితి సమావేశం ఈనెల 15న ఉదయం స్థానిక స్ఫూర్తి భవన్‌లో నిర్వహించనున్నట్టు బీకేఎంయూ ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బాపట్లలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే బీకేఎంయూ 22వ రాష్ట్ర మహాసభలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ పూర్తి

దెందులూరు: మండలంలో 20 సచివాలయాల పరిధిలో 368 మందికి కొత్తగా మంజూరైన పింఛన్ల నగదు పంపిణీ పూర్తి చేశామని డీఎల్‌పీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో మండలంలో అర్హులైన 368 మందికి నూతన పింఛన్ల మంజూరవడంపై డీఎల్‌పీఓ లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

18న ఎంఈఎఫ్ చలో ఢిల్లీ

దెందులూరు: మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) చలో ఢిల్లీ కార్యక్రమం ఈ నెల 18న నిర్వహించనున్నట్టు ఎంఈఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనర్ కలపాల సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా గోపన్నపాలెంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతరమంతర్ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఎంఈఓ సభ్యులు హాజరుకావాలన్నారు. ఢిల్లీ వచ్చే సభ్యులు ముందుగా 9010727014 నంబర్‌కు టికెట్ల రిజర్వేషన్ నిమిత్తం తెలియజేయాలని కోరారు.

ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడిగా గారపాటి

జంగారెడ్డిగూడెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గారపాటి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జంగారెడ్డిగూడెం ఎన్ఎంయూ అసోసియేషన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న గారపాటి రామారావు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు కార్మిక నాయకులు అభినందించారు. ఏలూరులో మంగళవారం జరిగిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నికైనట్టు రామారావు తెలిపారు. జిల్లా చైర్మన్‌గా షేక్ ఇమామ్, కార్యదర్శిగా బీఏస్‌రావు ఎన్నికైనట్టు చెప్పారు. ఆర్టీసీలో అతి పెద్ద అసోసియేషన్‌గా ఉన్న ఎన్ఎంయూకు ప్రభుత్వ గుర్తింపు లభించిందని, జీఓ విడుదల చేసిందని తెలిపారు.

ఆనంద'మనీ' పింఛెన్



కొత్త పింఛన్ లబ్ధిదారులతో కోఆప్షన్ సభ్యుడు జాన్‌గురునాథ్



10వ వార్డు సచివాలయం పరిధిలో మహిళకు కొత్త పింఛన్ అందిస్తున్న దృశ్యం

- ఒకే నెలలో 1,658 కొత్త పింఛన్ల మంజూరు
- ఏలూరు నియోజకవర్గంలో పంపిణీ

ఏలూరు (టూటౌన్): అర్హతే ప్రామాణికంగా.. కుల, మత, రాజకీయ పార్టీల బేధం లేకుండా పింఛన్లు మంజూరు చేస్తుండడంతో ఏలూరు నియోజకవర్గంలోని లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని చొరవతో ఏలూరు నియోజకవర్గం పరిధిలో మంగళవారం రెండో విడత 846 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈనెల ఒకటో తేదీన తొలి విడతగా కొత్తగా 812 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో ఈ ఒక్క నెలలోనే ఏలూరు నియోజకవర్గం పరిధిలో 1,658 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. తొలి విడత మంజూరయిన పింఛన్ల సొమ్మును ఇప్పటికే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రెండో విడత విడుదలయిన పింఛన్ల సొమ్ము ఈ నెల 14 వరకు పంపిణీ చేయనున్నారు. ఏలూరు 47వ డివిజన్ ఇజ్రాయేల్‌పేటలో నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ కొత్త పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులెవ్వరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేని విధంగా తొలివిడతలో పింఛన్లు మంజూరు చేయగా, మిగిలిపోయిన దరఖాస్తులను కూడా పరిశీలించి అర్హులందరికీ రెండో విడతలో ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేదలకు అన్ని రకాలుగా సహకారాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆళ్లనానిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు మేలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

30న మల్కాపురంలో ప్రారంభం

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత అన్నారు. మంగళవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఈ నెల 30న మాల్కాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. గ్రామాల్లో అనారోగ్యానికి గురైన ప్రజలకు గ్రామంలోనే మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకోసం ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటుచేశారని చెప్పారు. అక్టోబర్ 3న మాదేపల్లి, 5న జాలిపూడి, 6న కోటేశ్వరదుర్గాపురం, 10న పైడిచింతపాడు, 12న శ్రీపర్రు, 13 ప్రత్తికోళ్లలంక, 17న పెదయాగనమిల్లి, 19న కోమటిలంకలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్పొరేషన్ విలీన గ్రామాల్లో సైతం శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందుకోసం ఏలూరు తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో రెండు పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్య శిబిరానికి 15 రోజుల ముందు వలంటీర్లు, ఏఎన్ఎం కలిసి ఇంటింటికీ వెళ్లి అనారోగ్యబారిన పడిన వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. ఏడు రోజుల తర్వాత మరోసారి రోగుల ఇంటికి వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలని సూచించారు. అప్పటికీ రోగి కోలుకోకపోతే వైద్య శిబిరానికి తీసుకురావాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.సోమశేఖర్, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, చాటపర్రు, గుడివాకలంక పీహెచ్‌సీ వైద్యులు, ఎంఈఓ పాల్గొన్నారు.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు ఆర్‌బీఐ కొత్త పోర్టల్

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్



రుణప్రణాళిక, చైతన్య గ్రామీణ చైతన్య బ్యాంకు వార్షిక నివేదికను విడుదల చేసిన జిల్లా కలెక్టర్

ఏలూరు(మెట్రో): అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకోవడానికి ఉదగం పేరిట సెంట్రలైజ్డ్ వెబ్ పోర్టల్‌ను ఆర్‌బీఐ ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన బ్యాంకర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. 2023–24 వార్షిక రుణప్రణాళికను, చైతన్య గ్రామీణ చైతన్య బ్యాంకు వార్షిక నివేదికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఉదగం ద్వారా అన్ క్లెయిమ్డ్ మొత్తాలను తీసుకోవడం లేదా ఆయా ఖాతాలను పునరుద్ధరించుకోవడానికి వీలవుతుందని కలెక్టర్ చెప్పారు. ఏదైనా ఖాతాలోని నగదు 10 ఏళ్లు, లేదా అంతకు మించి వాడుకలో లేకపోతే దానిని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్‌గా పరిగణిస్తారన్నారు. అటువంటి ఖాతాల వివరాలను ఉదగం ద్వారా చూసుకోవచ్చని చెప్పారు. ఈ పోర్టల్‌లో ప్రస్తుతానికి మొదటి సారిగా ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ధనలక్ష్మి బ్యాంకు, సౌత్ ఇండియన్ బ్యాంకు, డీఎస్‌బీ బ్యాంకు ఇండియా లిమిటెడ్, సిటీ బ్యాంకుల అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లను పొందుపరచడం జరిగిందన్నారు. అక్టోబరు 15లోగా మిగిలిన బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు కూడా ఉదగం పోర్టల్‌లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

రుణాలందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి

కౌలు రైతులకు ఉదార స్వభావంతో రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ సూచించారు. సీసీఆర్‌సీ కార్డులు గల కౌలు రైతులకు పంటరుణాలు మంజూరు, జగనన్నతోడు, పీఎం విశ్వకర్మయోజన, పీయంఈజీపీ, జగనన్న పాలవెల్లువ, కార్యక్రమానికి రుణాల మంజూరుపై ప్రతివారం ప్రగతిని అందించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. జగనన్న పాలవెల్లువ కింద పాల ఉత్పత్తుని మరింత పెంచేందుకు లబ్ధిదారులు పశువుల కొనుగోలుకు బ్యాంకర్లు రుణాలు అందించాలని అన్నారు.

లబ్ధిదారుల ఎంపిక వేగవంతం

ఈనెల 17న ప్రారంభంకానున్న పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. 18 రకాల సంప్రదాయ, కుల, చేతి వృత్తులు వారికి తొలి విడతలో రూ.లక్ష వరకు రుణం, అనంతరం రూ.2 లక్షల వరకు సబ్సిడీ వడ్డిపై రుణాలు అందించనున్నట్టు కలెక్టర్ చెప్పారు. పీఎంఈజీపీకి రుణ అర్హత, 50 లక్షలలోపు, మించి రుణాలపై వడ్డీ రేటు తదితర వివరాలను పారదర్శకంగా ప్రతి బ్యాంకు బ్రాంచిలో డిస్‌ప్లే చేయాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత బ్యాంకు కార్యకలాపాలు, తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కలిగించాలన్నారు. ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో ఈ కార్యక్రమానికి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వాలని సూచించారు.

డీసీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ 2023–24 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.16,260 కోట్లు కాగా వ్యవసాయానికి రూ.11,411 కోట్లు కేటాయించగా ఇందులో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు రూ.6,648 కోట్లు, స్వల్ప, మధ్యతరహా పరిశ్రమలకు రూ.2,058 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ. 981 కోట్లు, కేటాయించినట్టు చెప్పారు. ప్రాధన్యేతర రంగాలకు రూ.1806 కోట్లు కేటాయించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు కింద రూ.1974 కోట్లు అందించామని చెప్పారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల కింద 2207 మందికి రూ. 15.44 కోట్లు అందించామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు, ప్రధానమంత్రి స్వానిధి, ప్రాధాన్యతా రంగాలకు, అందించిన రుణాల వివరాలను ఆయన వివరించారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ యం.గోపాలకృష్ణమూర్తి, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డీఓ పూర్ణిమా, ఎల్‌డీఎం డి.నీలాద్రి, నాబార్డ్ డీడీఎం అనిల్ కాంత్, పశు సంవర్ధకశాఖ జేడీ జి.నెహ్రూబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు పి.ఏసుదాసు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎస్ఎస్ కృపావరం, వివిధ బ్యాంకుల కంట్రోలర్‌లు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభానికి సన్నద్ధం కండి

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): పేదలందరికీ ప్రత్యేక వైద్య సేవలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభిస్తుందని, దీనికి అధికారులంతా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో సంక్షేమ పథకాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి జిల్లాస్థాయి వీడియో కాన్ఫరెన్స్ సంబంధిత అధికారులతో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా జిల్లాలో 477 మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 41 గ్రామాల్లో క్లీనిక్‌లోను, 145 సచివాలయాలలోను, 8 కమ్యూనిటీ భవనాలలోను మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారని వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక యాప్‌లో సమాచారాన్ని పొందుపరుస్తారని తెలిపారు. ఈ పథకం అమల్లో భాగంగా జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్, డివిజన్ స్థాయిలో ఏలూరు, నూజివీడు, ఐటీడీఏ ఏరియాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తారని వివరించారు. గ్రామ సచివాలయాల్లో ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు గ్రామాల్లోనే నివాసం ఉండాలని ఆదేశించారు.

- ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ఈ నెల 15 నాటికి ఓటర్ల రోల్ పూర్తిచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల పునర్విభజన ప్రతిపాదనలు ఈ నెల 22 నాటికి పంపాలని అన్నారు.
- జగనన్నకు చెబుదాంకు సంబంధించి విజయగాథలు అన్ని శాఖల అధికారులు పంపాలని ఆదేశించారు. మిషన్ జీఐఆర్, నాడు–నేడు రివాల్వింగ్ ఫండ్, నాడు–నేడు ఫేజ్–2 కింద మండలానికి 1 చొప్పున మోడల్ స్కూల్‌ను గుర్తించి ఫొటోతోసహా పంపాలన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రత్యేకమైన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను ఈ నెల 30లోగా పూర్తిచేసి నివేదికపంపాలని ఆదేశించారు. రీసర్వే, పాలవెల్లువ, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. జేసీ లావణ్యవేణి రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎంహెచ్ఓ షర్మిష్ఠ, పశు సంవర్ధకశాఖ జేడీ జి.నెహ్రూబాబు, డీఈఓ శ్యామ్ సుందర్, వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ, డీపీఓ తూతిక విశ్వనాథ్, శ్రీనివాస్, జిల్లాలోని ఆర్డీఓలు, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, డ్వామా పీడీ ఎ.రాము, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు



దర్గాలో ఫాతెహాఖానీ నిర్వహిస్తున్న ముజావర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శనివారపు పేట 6వ లైన్ సచివాలయం ఎదురుగా ఉన్న హజరత్ సయ్యద్ జమాల్ షా బాబా మహాత్ముల వారి ఉరుసు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్ ఎస్‌కే అమీర్ జానీ, కమిటీ సభ్యులు మాట్లాడుతూ తాత ముత్తాతల నుంచి ఉరుసు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దర్గా వద్దకు రావడానికి రోడ్డు సౌకర్యం లేదని, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. తొలుత డప్పులు వాయిస్తూ జండాలు ఎక్కించారు. గంధం, గలాఫ్‌లతో ముజావర్లు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు, భక్తులు, ముజావర్లు కలిసి బాబాకు గలాఫ్ సమర్పించి గంధం పూశారు. రియాజ్ బేగ్ ఫాతెహా ఖానీ నిర్వహించి సర్వమానవాళి సుఖశాంతులతో జీవించాలని ప్రార్థన చేశారు. ఉరుసుకు హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముజావర్లు ఎస్‌కే బాబు, కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు ఎండీ సలాం, ఎస్‌కే బాజీ, ఎస్‌కే సత్తార్, అబు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాలరాస్తే శిక్ష ఖాయం

భీమడోలు: బాలల స్నేహపూర్వక గ్రామాలు తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి కమిటీలు తమ వంతు కృషి చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్, విజయవాడలోని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో ఎంపిక చేసిన పది గ్రామాల్లోని కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, పీవో కేవీ విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. బాలల హక్కులు కాలరాస్తే శిక్షార్హులన్నారు. గ్రామాల్లోని గ్రామస్థాయి కమిటీలు సమావేశాలను నిర్వహించుకుని ఎప్పటిప్పుడు సమస్యలను తెలుసుకుని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలన్నారు. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చైల్డ్ రైట్స్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ బాలల స్నేహపూర్వక గ్రామాలు నెలకొల్పడంతో ప్రధాన భూమిక గ్రామ స్థాయి కమిటీలదేనన్నారు. ప్రతి 15 రోజులకొకసారి సమావేశాలు నిర్వహించి, గుర్తించిన సమస్యలపై తీర్మానాలు చేసి మండల స్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బాలల సహాయవాణి 1098కి సమాచారం ఇవ్వాలని కోరారు. డీసీపీయూ సిబ్బంది శ్రీకాంత్, సూపర్‌వైజర్లు, హెచ్‌ఎంలు, గ్రామ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కమిటీ రెండో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): జిల్లా ధాన్యం సేకరణ కమిటీ రెండో సమావేశం ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఖరీఫ్ 2023–24నకు ముందస్తు చర్యల్లో భాగంగా అవసరమైన గోనె సంచులు సమకూర్చటం, సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చుకోవాల్సిందిగా రైస్ మిల్లర్లకు, లారీ అసోసియేషన్ వారికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తగు సూచనలు చేశారు. ట్రాక్టర్లకూ జీపీఎస్ పరికరాలను అమర్చుకొనేలా అసోసియేషన్‌ను ఒప్పించాలన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న 225 లారీలను, లారీ అసోసియేషన్ వద్ద ఉన్న 250 లారీలను ధాన్యం రవాణాకు అందుబాటులో ఉంచేలా చూడాలని ఆదేశించారు. సీజన్‌లో రోజుకు సుమారు 500 వాహనాలను అందుబాటులో ఉంచాలని, వాటికి జీపీఎస్ పరికరాలను అమర్చి ధాన్యం సేకరణ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రంతో ఎంఓయూ చేసుకొవాలని, వారం రోజుల్లో సదరు రైతుకు లేదా కాంట్రాక్టర్‌కి రవాణా చార్జీలు చెల్లిస్తారని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పర్యావరణంపై అవగాహన కలిగిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతంటూ కళాజాత కళాకారులు ప్రజల్లో అవగాహన కల్పించారు. ఏలూరు ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ఆదేశానుసారంగా జిల్లా పర్యావరణ ఇంజినీర్ పర్యవేక్షణలో వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయక విగ్రహాలని వాడకూడదని, మట్టితో తయారుచేసిన విగ్రహాల్నే వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలని కళాజాత నిర్వహించారు. పర్యావరణ అనుకూల వినాయక చవితి నిర్వహించుకోవాలని, మితిమీరిన సౌండ్ బాక్స్‌లని అరికట్టి శబ్ద కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రజలను చైతన్యపరిచారు. కళాజాత బృందం ద్వారా ఏలూరుకు చెందిన కళాకారులు ఎం కుమార్ బృందం స్థానిక పవర్‌పేట, ఇస్లాంపేట కూడళ్లలో అవగాహన కల్పించారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోందని దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ తెలిపారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఏపూరు గ్రామానికి చెందిన వామరాజు వెంకట నర్సింహరావు విరాళం అందించారు. ఆలయ చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ శ్రీనివాస్, అర్చకులు రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయి

గణపవరం: కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు అందుకుని, ఉన్నత స్థాయికి చేరుకోగలమని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరంలోని మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న షేక్ పర్వీన్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పర్వీన్‌ను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మంగళవారం కాలేజీలో అభినందన సత్కారం ఏర్పాటు చేశారు. పర్వీన్‌ను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పర్వీన్ అధ్యాపకురాలిగా పనిచేస్తూ, కుటుంబ బాధ్యలు చూసుకుంటూ అత్యున్నతమైన పీహెచ్‌డీ పట్టా సాధించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ మధురాజు, అధ్యాపకులు అనూరాధ, వెంకట్రావు, స్వరూపరాణి, వెంకటరమణ, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

గణపవరం: కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, తక్షణం వైద్య సహాయం పొందాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గణపవరం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 29 మందికి కళ్లజోళ్లు పడినట్లు ఆప్తాలమిక్ అసిస్టెంట్ శ్రీనివాస్ తెలిపారు. వీరందరికీ వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో జరగనున్న ఈ ఆటల పోటీలకు మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీల్లోని 150 మంది క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. ఈ పోటీలను ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు వాలీబాల్ ఆడి ప్రారంభించారు. క్రీడాకారులను ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోటీతత్వంతో పాటు క్రీడా స్ఫూర్తిని చాటాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజవర్గం, జిల్లాస్థాయి పోటీల్లో తమ సత్తాను చాటి మండలానికి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు తీసుకుని రావాలని కోరారు. అనంతరం మండల కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల పీడీలు ఆధ్వర్యంలో పోటీలు ఉల్లాసంగా సాగాయి. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, షటిల్, యోగా పోటీల్లో బాలబాలికలు చురుగ్గా పాల్గొని విజేతలుగా నిలిచి క్రీడాస్ఫూర్తిని చాటారు. క్రీడల్లో తమ చక్కని ప్రతిభను చాటిన బాలబాలికల వివరాలను జిల్లా ఫెడరేషన్ కమిటిని తెలియజేస్తామన్నారు. ఈ నెల 13వ తేదీ బుధవారం అథ్లెటిక్స్ పోటీలు, ఖోఖో, టెన్నికాయిట్, బాల్‌బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో పీడీలు డి.శంకర్, ఎం.ప్రసాద్, పి.కృష్ణారావు, టి.రాహుల్, కె.ప్రమీలారాణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	34
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	22